# 'సుబ్బి...!'

**-ఎ. సువర్ణ**

'ఒళ్లంతా పట్టుకు పిండుతున్నట్లుగా ఒళ్లంతా ఒకే నొప్పులు, ఇంకాసేపు పడుకోనీ అని శరీరంలోని ప్రతీ అణువు బతిమలాడుతున్నా పడుకోలేని పరిస్థితి. లేచే తీరవలసిన నిర్బంధం. ఇప్పుడు లేచి పని చెయ్యడం మొదలుపెడితేనే సమయానికి పని పూర్తవుతుంది.

ఏ పనీ పాట చెయ్యని మొగుడి మీద సుబ్బికి మహా ప్రేమ. తను పనికి వెడితే తమ రెండేళ్ల కొడుకుని జాగ్రత్తగా చూసుకుంటున్నాడన్న కృతజ్ఞత సుబ్బికి...! తను నాలుగిళ్లలో కష్టపడి సంపాదించుకొచ్చిన డబ్బు ముష్టివానికి మల్లే బతిమలాడి లాక్కుపోయే మొగుడి మీద విరుచుకుపడదు.

ఆమె ఆరు గంటలకు పనులు పూర్తిచేసుకు ఇంటికి రాగానే వాడు ఊరంబడి తిరగడానికి బయటికెళ్లి పోతాడు. రాత్రి పన్నెండు గంటలకు పీకల దాకా తాగొచ్చి ఇంట్లో గొడవ చేస్తాడు. అప్పుడప్పుడు సుబ్బిని కొడతాడు కూడా. సుబ్బికి అలవాటైపోయింది. పేద వాళ్లందరి జీవితాలలోనూ ఈ అదనపు కష్టాలెందుకో ఆమెకు అర్థంకాదు ఎంత ఆలోచించినా..!

❍ ❍ ❍

సుబ్బి పనిచేసే ఇంటి యజమానురాలి మనసు మంచిది. రోజంతా పనిచేసే శ్రమంతా ఆమె శాంతవచనాలతో ఎగిరిపోతుంది.

పక్షవాతం వచ్చి భర్త మంచం పట్టాక యజమానురాలు ఎక్కువగా సుబ్బిమీదే ఆధారపడింది. సుబ్బికి యజమాని అమ్మగారంటే ఎక్కువగా ఇష్టపడడానికి కారణం ఆమెలోని ధైర్యమే! అయ్యగారికి కాలు, చెయ్యి పడిపోవడంతో పాటు నోటి మాట పడిపోయినా ఏమాత్రం అధైర్యపడకుండా ఆయనకు సేవలు చెయ్యడమే అందుకు కారణం.

మంచివాళ్లకే ఇలాంటి కష్టాల నెందుకిస్తాడో ఆ భగవంతుడు అని బాధపడుతుంది సుబ్బి.

పనిచేసే ఇంటి దగ్గరకు వచ్చాకే ఇల్లు తాళం వేసుండడం చూసింది సుబ్బి.

అయ్యగార్కి సీరియస్ అవడం వల్ల రాత్రే ఆస్పత్రిలో చేర్చారట.

పొద్దున్నే పనికొచ్చిన సుబ్బికి తాళం చెవి ఇస్తూ పక్కింటామె చెప్పిన వివరాలివి.

సుబ్బి ఇంటి పనులన్నీ చకాచకా పూర్తిచేసింది. పది గంటలకు అమ్మగారు ఫోను చేశారు. అయ్యగార్కి బాగానే వుందిట. తను గంటలోగా వస్తానని చెప్పింది.

చెప్పినట్లుగానే అమ్మగారు వచ్చీ రాగానే స్నానం చేసి వంటచేసి అయ్యగారికని కారియర్ సర్దింది.

"..నువ్వు అన్నం తిని వంటగది శుభ్రంచేసి ఇంటి కెళ్లిపో...! నేను రాత్రికి ఆస్పత్రిలోనే పడుకుని పొద్దున్నే వస్తాను" అన్నారు.

"అమ్మగారూ కాసేపాగండి. నేనూ మీతో వస్తాను. మీరొక్కరే వెళ్లొద్దు" అన్నది సుబ్బి.

లోకల్‌లో వెడితే తొందరగా వెళ్లొచ్చని సీతాఫల్ మండీ స్టేషన్‌కెళ్లాం. బాగా రద్దీగా వుంది. ఆఫీసు వేళలుగా..!

లోకల్‌లో వెళ్లే అలవాటులేని సుబ్బికి ఆ జన సందడి ఉక్కిరి బిక్కిరిగా ఉంది. ఊపిరి పీల్చడం కష్టంగా వుంది. సుబ్బికి పక్కగా నిల్చుంది దువ్వెనలు, కాటుక బొట్లు అమ్మే అమ్మాయి. ఓ స్టిక్కర్ పాకెట్ సుబ్బి మొహం ముందుకు చూపింది.

పాపం! భుజానికి సామాన్లతో నిండున్న సంచీ వేళ్లాడేసుకుంది. అడ్డంగా కట్టుకున్న బట్టలో ఏణ్ణర్థం రెండేళ్లుంటే పోరడు తల వేళ్లాడేసుకు నిద్రపోతున్నాడు. వాడు అచ్చం తన బిడ్డ శీనూలానే కనిపిస్తున్నాడు సుబ్బి కళ్లకి.

ఆ.. అంతా తన భ్రమ.. బిడ్డను ఇంట్లో వదిలి రావడం వల్ల తనకలా అనిపిస్తున్నది. పసివాడు ఏం చేస్తున్నాడో ఏమిటో!

అమ్మగారితో ఆస్పత్రికెళ్లి అయ్యగారిని చూసి వచ్చేస్తూండగా స్టేషను కెళ్లేందుకు దారి చెప్పి ఖర్చుకు డబ్బులిచ్చారు.

"అమ్మా తమరబ్బాయిలకు విషయం చెప్పమంటారా..?"

"వద్దు సుబ్బీ.. వాళ్లు కంగారు పడతారు. అయ్యగారికి బాగైపోతుంది."

అమ్మగారి ధైర్యానికి అచ్చెరువొందుతూ సుబ్బి లోకల్ ఎక్కింది. కూర్చునేందుకు జాగా వుండడం వల్ల సీట్లో కూర్చుంది. కాస్త కన్ను మూసేసరికి అరుపులు కేకలు వినిపించి కళ్లు తెరిచింది. పక్క పెట్టెలోని ఓ

అమ్మాయి హాండ్‌బాగ్ లోంచి పర్సు కొట్టేశారట.

"రష్‌లో ఎవరో కత్తెరతో ఆమె హాండ్ బాగ్ కత్తిరించి పర్సు కొట్టేశాడు. అందులో రెండు అయిదు వందల రూపాయల నోట్లు వున్నాయట. పాపం! షాపింగ్‌కని బయలుదేరిందట. ఈ దొంగతనాలలో రైల్లో బొట్లు, దువ్వెనలు అమ్ముకునేవాళ్లకు భాగం వుందిట" అని మాట్లాడ్డం సుబ్బి చెవులకు వినిపించినయ్యి.

"ఛా.. ఛా.. ఎంత అన్యాయం.. ఎంత పాపం! పిల్లల్ని ఒడిలో కట్టుకుని ఏవో సామాన్లు అమ్ముకుని మర్యాదగా జీవితాలు వెళ్లదీస్తున్నారు. రోజుకు పదో పరకో సంపాదించుకునే వారి మీద అన్యాయంగా అపనిందలు వెయ్యకూడదు."

"అహ..! కాదు.. కాదు.. ఈ ఒడిలో పిల్లల్ని కట్టుకు రావడం అంతా ఓ వేషం..! ఈ పిల్లలు కూడా వాళ్ల సొంత పిల్లలు కారట. ఇరవై ముప్పై రూపాయలకు బాడుగకు దొరుకుతారట పిల్లలు. చంకలో ఎత్తుకొస్తే ఎవరికీ అనుమానం రాదు. అయ్యో పాపం అని జనం సామాన్లు కొనుక్కుంటారు. అప్పుడు వాళ్లకు సంబంధించిన మనుషులు గుంపులో చేరి పర్సులు కొట్టెయ్యడం, పిక్‌పాకెట్లు చెయ్యడం, హ్యాండ్ బ్యాగులు

## నేల తిరుగుబాటునూ కంటుంది

నడి ఎండలో ఆకులు రాలిన చెట్టు
పిడికెడు ఉడికీ ఉడకని కూడు
మూడు ముద్దలకే ఆకలిని చల్లార్చే
ఓ ముగింపు గీతం
ఆకలి కూడా ఓ రాగమే
అందుకే అర్ధాకలితో వున్న ఎందరో
వాగ్గేయకారులు జీవన సత్యాలు చెప్పారు
శ్రమ నుండి అక్షరంలోకి
పరివర్తితం చేయాలంటే,
మెదడుకు ఇంధనమైన
ఆహారాన్ని అందించాలి కదా!
ఆ పక్షి కూసిందంటే
దానికి గింజలు
ఆ చెట్టు నిరాపేక్షంగా అందిస్తుంది
దాని ఎలకూతకు చిగురాకులు
ప్రేమగా తినిపిస్తుంది
లేత లేత వెన్నెల్లో తడిపి
దాని సంగీత అభ్యసనానికి
ఊపిరి పోస్తుంది
ఇన్ని కోయిలలు
ప్రాకృతిక విద్యను అభ్యసించాయంటే
ప్రకృతి ఒడిలో అవి సజీవం అవుతున్నాయి
మనుషులు స్వార్థ కుక్షులవుతున్నారు
తమ బిడ్డలకే సర్వసంపదలు ధారపోయాలని,
వారి నాసాగ్రాలకే సర్వరసాలు
అందించాలని ప్రయత్నం చేస్తున్నారు
భూమి నుండి విత్తనాలు మొలిచినట్టే
అక్షరాలను ధరిస్తున్నవారికి
శక్తిని కలిగించండి
దేశంలో విద్య పరిఢ విల్లుతుంది
బోధనంటే మెదడులను
బండరాళ్ళుగా మార్చడం కాదు
మేథో భూమిలో విత్తనాలు చల్లండి
చెట్లు భూమిలోనే కాదు ఉండేది
ఈనాటి మొక్కలే రేపటి
భావి తరాలకు ఆయువులు పోసేది
నిర్లక్ష్యం వద్దు, నిరాదరణ వద్దు
బొగ్గు గనుల్లో నుండే
నిప్పుకణాలు పుడతాయి
ముందు ఆ పిల్లల డొక్కలు నింపండి
మీ బొక్కసాలు నిండుతూనే వుంటాయి
వాడు డ్రాపౌట్ అయ్యాక
అటు శ్రమ, ఇటు ఆలోచన రెండూ నశిస్తాయి
అప్పుడు నీ రాజ్యం పునాదులు
ఆ పగిలిన పలక నుండే వ్రయ్యలవుతాయి
దేశానికి జ్ఞానం ఆయుస్సు
అక్షరం, ఆహారం సమతుల్యం కావాలి సుమా!
అందుకే అటువైపు చూడు
వాడు ఈ నేల బిడ్డ
నేల పిల్లలనే కాదు
తిరుగుబాటులనూ కంటుంది

-కత్తి పద్మారావు

కత్తిరించడం వంటి పనులు చేస్తారట. ఈ విషయాలన్నీ అన్ని పేపర్లలోనూ వచ్చినయ్యి. చదవలేదూ?"

"ఆ.. అవునవును.. పేపర్లలో ఎన్నోరకాల వార్తలొస్తున్నా అన్నింటికి మనమే అన్ని జాగ్రత్తలలోనూ వుండాలి..."

ఇలా అందరూ తలోరకంగా మాట్లాడారు. సుబ్బి పది రూపాయలు మాత్రమే వున్న పర్సును తన జాకెట్టులో దాచుకుంది.

ఇంటికొచ్చిన సుబ్బి తలుపు దగ్గరగా వేసుండడం చూసింది. తోసి లోపలకు చూస్తే తన భర్త, కొడుకు కనపడలేదు. బయటకొచ్చి రోడ్డు చివరున్న టీ దుకాణం వైపు చూసింది. అక్కడ కూర్చుని టీ తాగుతున్నది తన మొగుడేనా అని పరకాయించి చూసింది.

అంతలోగా అతనే భార్యను చూసి పరుగు పరుగున ఇంటికొచ్చాడు.

"ఏమిటే సుబ్బీ ఇంత తొందరగా వచ్చేశావు? నాలుగేగా అయింది? పనంతా అంత తొందరగా అయిపోయిందా? సుబ్బీ...?" అని అతనడిగిన దాంట్లోని గాభరాని గమనించని సుబ్బి... ఏమండీ ఒక్కరే వున్నారేమిటి? మనబ్బాయేడి?" అని అడిగింది.

"వాడా..?" అని నీళ్లు నములుతున్నాడు. నువ్వు రావడానికి ముందు మా అక్కయ్య, బావ వచ్చారు. చిన్న పిల్లాడు ముద్దొస్తున్నాడంటూ మళ్లీ ఇప్పుడే తీసుకొస్తామని ఎత్తుకెళ్లారు. తొందరగానే తీసుకొచ్చేస్తామన్నారు. అయినా నే వెళ్లి తీసుకొస్తాను. నువ్వింటికెళ్లు.." అని వాడక్కడ నుంచి వెళ్లాడు.

"హూ.. ఇంటికి తొందరగా వచ్చి ఏం లాభం?" అనుకుంటూ బరువుగా అడుగులేస్తున్న సుబ్బికి ఎదురింటి అంజలి ఎదురుపడింది.

"ఏమే సుబ్బీ.. ఇవాళ ఇంటికి తొందరగా వచ్చినట్లుంది?" అడిగింది.

"అవునక్కా...! అయినా చూడు ఏం జరిగిందో?" అన్న సుబ్బిని ఏం జరిగిందన్నట్లుగా చూసింది.

"ఆ అక్కయ్య చూసి చూసి ఇవ్వాళే నా కొడుకుని తనింటికి తీసుకెళ్లాలా..? ఆయనెళ్లారు తీసుకు రావడానికి..!"

సుబ్బికి అంజలి ఏదో చెప్పాలనుకుని పెదాల వరకూ వచ్చిన దాన్ని అక్కడే అణిచేసినట్లనిపించింది. దాన్ని గురించి అడగకుండా ఇంటికొచ్చిన సుబ్బికి బాగా అలసటగా వుండి పడుకునేసరికి నిద్రపట్టింది.

మళ్లీ మెలకువ వచ్చేసరికి చీకట్లు అలుముకున్నాయి. పక్కనే చాపలో పడుకుని వేలు చీకుతూ పడుకున్న కొడుకుని చూస్తూనే 'నా బంగారు తండ్రే' అంటూ గుండెలకు గాఢంగా హత్తుకుంది.

❍ ❍ ❍

ఆ రోజు పని పూర్తిచేసి అన్నం తిన్నాక మధ్యాహ్నం కాస్త అలసటగా వుందని నేలమీదే పడుకుంది సుబ్బి.

కాలింగ్ బెల్ మోగింది. సుబ్బి లేచి వెళ్లి తలుపు తీసింది. పక్కింటి కుర్రాడు శంకర్.

"ఏమిట్రా ఇలా వచ్చావు? ఏమిటి సంగతి?" అడిగింది.

"అక్కా, నిన్ను వెంటనే తీసుకురమ్మన్నారు. బాబుకు బాగుండలేదట" అన్న వాడి మాటలకు సుబ్బి కంగారు పడింది.

"నా బాబుకేమైందిరా?"

"ఏమో తెలీదు కానీ మన స్పృహలో లేడు. నిన్ను వెంటనే తీసుకు రమ్మన్నారు."

సుబ్బికి కాళ్లు చేతులు ఆడడంలేదు. ఒళ్లంతా

## వందే మానవ యువతరం

స్వాభిమానము అణువు అణువున వెల్లివిరియు చూడ
భారత జాతి వీర శౌర్య త్యాగ ముద్దుబిడ్డలను తలుచుచుండ
అందరికీ స్ఫూర్తిదాయినివై విశ్వశాంతిని కోరుతూ
స్వాతంత్ర్య స్వేచ్ఛను తెలియజేయు శుభమంగళకర
ఆనంద దినోత్సవపు ఆహ్లాద సంబరమయం
హృదయ మనోనేత్రాలకు హర్షాతి బిందువులను
కురిపించి మురిపించే ఉత్సవపు వేడుక సమయం
కమనీయ సుందర వసంతపు వందనాలు అందుకుంటూ
తనువునంతా పులకరించి పలుకరించే
నా భారతీయ జెండా
నీకు శుభోదయ తరుణం
మాకు శుభ మంగళకర సమయం
శుభాకాంక్షలతో చిరు చిరు నవ్వుల
హృదయాంజలిని అందించే చిన్నారుల తేజం
మనస్ఫూర్తికి జాతికి నివాళులు అర్పించే యువకిషోరం
సదా నీకు మా వందేమాతరం

*-రాంబత్రి గంగాధర్*

చెమటలు పడుతున్నాయి.

"ఓరి దేముడా.." అంటూ పొంగుకు వచ్చే కన్నీటిని ఆపుకుంటూ బయలుదేరింది.

"బిడ్డకేం అవదు.. ధైర్యంగా వెళ్లు.. ఇంద ఇది ఖర్చుల కుంచుకో" అని యజమానమ్మ అయిదు వందల రూపాయల నోటు సుబ్బి చేతిలో పెట్టింది.

అడగకుండానే ఇచ్చినామెకు కృతజ్ఞత తెలపాలని కూడా తెలీకుండా ఆటోలో ఇంటికెళ్లింది.

"ఇదేమిటి.. ఇంటిముందు ఇంతమంది జనం? ఓరి బగమంతుడా అని ఏడుస్తూ లోపలకొచ్చిన సుబ్బికి తన బాబు శవంగా మారి గుడ్డలో చుట్టబడి వుండడం చూసి కడుపులో భగ్గున మంటలు రేగాయి."

శవంగా చుట్టి వున్న బాబు పక్కనే నెత్తిన చేతులు పెట్టుకు కూర్చున్నాడు సుబ్బి మొగుడు. వాడితోపాటు మరో నలుగురైదుగురు మగాళ్లు కూర్చుని కన్నీరు కారుస్తున్నారు.

భార్యను చూస్తూనే మొగుడు హోరున ఏడవడం మొదలుపెట్టాడు.

"ఏమైంది.. ఆ..? నా బాబుకేమైందో ఎవరైనా చెప్పండి" అని తనడిగిన ప్రశ్నకు వచ్చిన సమాధానాన్ని సుబ్బి నమ్మలేక పోయింది.

ప్రతీరోజూ భర్త బాబుని రైళ్లలో బొట్లు, పిన్నులు, దువ్వెనలు అమ్మే వాళ్లకు బాడుగకు ఇస్తాడట. ఇవ్వాళ పొద్దున ఓ ప్రయాణీకుడు తన దగ్గరకు బిడ్డతో వచ్చిన దాన్ని గుర్తుపట్టేసరికి అతని నుంచి తప్పించుకోవాలని చేసిన ప్రయత్నంలో కాలు జారి పడిపోయిందట- వీపుకు కట్టుకున్న పిల్లాడు పట్టాల మీద పడి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు.

పోలీసులు దాన్ని పట్టుకు నాలుగు తగిలించి వివరం రాబట్టి అడ్రసు తెలుసుకుని సుబ్బి మొగుడిని రమ్మని కబురు పంపించారు.

వాడు అక్కడా ఇక్కడా తిరిగి పోలీసుల చేతిలో దెబ్బలు తిని, ఆస్పత్రి వాళ్లడిగిన ఎన్నో ప్రశ్నలకు సమాధానాలు చెప్పి ఎలాగోలా కొడుకు శవాన్ని తీసుకుని శోకదేవతలా ఇంటికొచ్చేప్పటికి ఆవేళైంది.

బంధువులు, స్నేహితులు, ఇరుగు పొరుగు వాళ్లు సుబ్బినెంతగానో ఓదార్చారు. దుఃఖం... ఎల్లలు మీరిన దుఃఖం. పరాకాష్టకు చేరుకున్న దుఃఖం. మనసులో అసహ్యం వేళ్లు పాతుకుపోయింది.

కేవలం ఏభై, వంద రూపాయల కోసం? అడిగితే నేనే మా అమ్మగార్నడిగి ఇచ్చి వుండేదాన్ని. ఇలా ప్రతీరోజూ నా బాబుకు నిద్రమాత్ర వేసి, దొంగతనాలు, దొంగ అమ్మకాలు చేసే గుంపుకు అద్దెకిచ్చి, మేలుకోని నిద్రలోకి పంపేశాడే..!

బాబుని మట్టిలో కలిపాక ఎన్నో రాత్రులు సుబ్బి నిద్రపోలేదు.

"నీకేమిటి..? నువ్వింకా చాలా చిన్నదానివి. తొందరగానే మరో బిడ్డ పుడతాడు" అని ఓదార్చింది చివరింట్లో వుండే అమ్మమ్మ. అప్పటికే సుబ్బి కడుపులో రెండు నెలల పిండం పెరుగుతున్న విషయం ఎవరికీ తెలియదు.

రెండో బిడ్డ పుడుతున్నాడని మొదటి బిడ్డను పోగొట్టుకునేందుకు ఏ తల్లి మనసైనా అంగీకరిస్తుందా?

కాలమే అన్ని గాయాలను మాన్పుతుందని అందరూ అంటున్నట్లుగానే సుబ్బి మొగుడు అనుకుంటూ కాలం గడుపుతున్నాడు.

ఇవ్వాళ..! ఒక నెల గడిచిపోయింది. కొద్దిగా చుక్కేసుకొచ్చిన మత్తు వాడికి. భార్య పొందు కావాలనిపించింది. మెల్లగా దగ్గరకు చేరి ఆక్రమించుకోబోతున్న మొగుడ్ని గట్టిగా తోసింది సుబ్బి.

వాడిని చూస్తుంటే మొగుడిలా కనపడ్డంలేదు. పెద్ద కొండచిలువ తనను మింగడానికి వస్తున్నట్లుగా అనిపించింది.

సుబ్బి రక్తం సలసలా మరిగిపోతోంది. కోపజ్వాలలు పైకి చిమ్ముతున్నాయి.

"పోరా వెధవా.. సొంత బిడ్డనే చంపిన పాపాత్ముడా.. ఇంకా నీతో నే వుండి కాపరం చేస్తాననే అనుకుంటున్నావా? భర్తగానో, తండ్రిగానో వుండే అర్హత లేని నీకు అసలు మనిషిగా వుండే అర్హతే లేదు" అని ఏడుస్తూ సుబ్బి గుడిసె మూలకెళ్లి మోకాళ్లలో తలపెట్టుకు ఆలోచిస్తున్నది.

కడుపులో పెరుగుతున్న బిడ్డనేవిధంగా పెంచడం?

ఈ కిరాతకుని నుంచి విడిపోయి తనే ఒంటరిగా బిడ్డను పెంచాలన్న నిర్ణయానికొచ్చింది సుబ్బి.

అమ్మగారు ఇంత వయస్సైనప్పటికి మంచం పట్టిన అయ్యగారిని శ్రద్ధగా చూసుకోవడంలేదూ? నేనింకా ఎంతో చిన్నదాన్ని. నేనీ చంటి బిడ్డను పెంచలేనా అన్న నమ్మకంతో సుబ్బి గుడిసె తలుపులు తెరుచుకు బయటకొచ్చింది.

బాలభానుడు రెండు చేతులతో ఆహ్వానిస్తున్నాడు తన లేత కిరణాలతో...! ■